



ధాన్యాన్ని శుభ్రం చేసి విక్రయించాలి

- సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ
- ప్యాడీ క్లీనర్ మిషన్‌లో స్వయంగా వడ్లు పోసి శుభ్రం చేసిన కలెక్టర్



ప్యాడీ క్లీనర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన ధాన్యాన్ని శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మండల పరిధిలోని పాతూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ప్యాడీ క్లీనర్ మిషన్‌లో స్వయంగా వడ్లు పోసి శుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో యాసంగి వడ్లు కొనడానికి 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈసారి కోతలకు ముందే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని పేర్కొన్నారు. రైతులు తాలు లేకుండా, శుభ్రంచేసి, తేమ 17 శాతం ఉండేలా చూసుకుని విక్రయిస్తే మద్దతుధర లభిస్తుందని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర నిర్ణయించినందని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- రక్షణ దిమ్మెలు లేక ప్రమాదాలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

8లో



కంది మండలం లక్ష్మీనగర్ కాలనీలో ఓ ఇంట్లో దొంగతనం (ఫైల్)

రికవరీ

చోరీ కేసుల్లో సొత్తు మాయం

- గతేడాది పోయిన సొత్తు రూ.7,55,31,071
- రికవరీ రూ. 3,73,21,274
- దోచేస్తున్నారా? దాచేస్తున్నారా?
- బాధితుల రోదన.. అరణ్య వేదన
- చేతికొచ్చిన దానితోనే సరి!



సంగారెడ్డి పట్టణంలోని అయ్యప్పకాలనీలో నివాసముంటున్న దినేష్ గతేడాది ఆగస్టు నెలలో ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. మరుసటి రోజు తిరిగొచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు బీరువాలో దాచిపెట్టిన భారీ ఎత్తున బంగారం, వెండితో పాటు రూ.6.80 లక్షలు నగదు దొంగలు దోచుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వారం రోజుల్లో దొంగను పట్టుకున్నారు. నిందితుడి నుంచి బంగారం రికవరీ చేశారు. అయితే, నగదు మాత్రం రికవరీ కాలేదని పేర్కొన్నారు. చోరీకి గురైన బంగారంలో పది తులాల వరకు మాయమైందని, నగదు తన చేతికే రాలేదని బాధితుడు వాపోయాడు.

కంది మండలం లక్ష్మీనగర్ కాలనీలో గతేడాది జూన్‌లో ఓ హోటల్ షట్టర్ తాళాలు పగులగొట్టి రూ. 10వేల నగదు దొంగిలించారు. అదే కాలనీకి చెందిన గౌస్ అనే వ్యక్తి ఇంట్లోనూ తాళాలు పగులగొట్టి 2.5 తులాల బంగారం, రూ. 70వేలు నగదు దోచుకెళ్లారు. జుబేర్ అనే వ్యక్తి ఇంట్లోనూ ఇలాగే తులంనర బంగారం, రూ. 10 వేలు నగదు చోరీ జరిగింది. ఈ కేసుల్లోనూ నగదు మాత్రం రికవరీ కాలేదని బాధితులు తెలిపారు.

కొండాపూర్ మండలం తేర్పోల్‌లో సూరి కృష్ణ ఇంట్లో దొంగతనం జరిగి మూడు తులాల బంగారం, రూ. 30వేల నగదు అపహరణకు గురైంది. ఈ కేసులో నిందితుడు దొరికినా బంగారం రికవరీ అయ్యింది. కానీ, నగదు మాత్రం రికవరీ కాలేదు.

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకొంటున్నారు. ఇటీవల జిల్లాకేంద్రంలో దుకాణాలనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు నివాసముండే జిల్లాకేంద్రంలోనే ఈ పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగిస్తోందని ప్రజలు వాపోతున్నారు. దొంగతనాల తీరు ఇలా ఉంటే.. సొమ్ము రికవరీ కథ మరోలా ఉన్నది. జిల్లాలో గత సంవత్సరం వివిధ దొంగతనాల కేసుల్లో మొత్తం రూ.7,55,31,071 నగదు బాధితులు కోల్పోయారు. ఇందులో పోలీసులు కేవలం రూ.3,73,21,274 మాత్రమే రికవరీ చేశారు. కేవలం 49 శాతం మాత్రమే రికవరీ సాధ్యమైంది.

చోరీ సొత్తు మాయం

దొంగతనాల్లో ఆభరణాలు, నగదును పోగొట్టుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. విచారణ జరిపిన పోలీసులు దొంగతనాలకు పాల్పడిన నిందితులను కొన్ని నెలల తర్వాత పట్టుకుంటున్నారు. ఆభరణాలు, బంగారం, వెండి వస్తువులను రికవరీ చేస్తున్నా నగదు రికవరీ కావడం లేదని పోలీసులు లెక్కలు చూపిస్తున్నారు. చోరీ జరిగిన వారం.. నెల రోజుల్లోనే దొంగలను పట్టుకున్న సందర్భంలో కూడా నగదు రికవరీ చూపించడం లేదు. కొన్ని కేసుల్లో ఆభరణాలు పూర్తిస్థాయిలో తిరిగి రావడం లేదని బాధితులు పేర్కొంటున్నారు. చోరీ జరిగి కొన్ని సంవత్సరాల తర్వాత నిందితులు దొరికితే నగదు ఖర్చు చేసేశారనుకోవచ్చు. కానీ, వారంలో పట్టుబడిన సందర్భంలో కూడా నగదు రికవరీ కాలేదని చెప్పడంలో ఆంతర్యమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. నగదు పట్టుబడలేదా.. లేక

మిగతా 8వ పేజీలో..

గత మూడేళ్లలో జరిగిన దొంగతనాలు

సంవత్సరం	2022	2023	2024
బందిపోటు దొంగతనాలు	2	1	1
దోపిడీలు	9	17	36
పగటి దొంగతనాలు	36	55	46
రాత్రి దొంగతనాలు	167	197	215
సాధారణ దొంగతనాలు	495	420	639
గొలుసు దొంగతనాలు	13	15	21

దొంగతనాల కేసుల్లో సొత్తు రికవరీ వివరాలు

సంవత్సరం	2022 (45 శాతం)	2023 (26 శాతం)	2024 (49 శాతం)
కోల్పోయిన సొత్తు	రూ.4,46,81,032	రూ.7,03,16,705	రూ.7,55,31,071
సొత్తు రికవరీ	రూ.1,99,99,157	రూ.1,85,53,010	రూ.3,73,21,274

తారు రోడ్డుకు ప్యాచ్‌లతో సరి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ మండలం స్టేషన్ మాసాయిపేట నుంచి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం వరకు రోడ్డుకు ప్యాచ్ వర్కులు చేపట్టారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో 9.50 కిలోమీటర్ల పొడవు వేసిన రోడ్డు నాణ్యతతో నిర్మించలేదు. ఈ విషయాన్ని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'నెల రోజులకే తారుమారు' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో, కాంట్రాక్టర్ ఆగమేఘాల మీద మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై తారు లేచిపోయిన ప్రాంతంలో తారు వేసి డస్టు పోశారు. గ్రామస్థులు మాత్రం ప్యాచ్ వర్కుతో సరిపెడితే సహించబోమని, నాణ్యమైన రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.



ఇస్లాంపూర్ వద్ద రోడ్డుకు ప్యాచ్‌వర్క్

సంక్షేమ పథకాల కోసం కంట్రోల్ రూమ్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు, ఎల్ఆర్ఎస్, రాజీవ్‌యువవికాసం పథకం, తాగునీటి ఎద్దడి నివారణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. రాజీవ్ యువ వికాసం అప్లికేషన్‌లో ఇబ్బందులు తలెత్తితే, ఇందిరమ్మ ఇళ్లపై ఏదైనా సమస్యలుంటే 08455-276155 నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

సన్నాలన్నీ మార్కెట్‌కే!

- దిగుబడి అంచనా లక్ష మెట్రిక్ టన్నులు
- ధాన్యం కొనుగోలుపై వ్యాపారుల దృష్టి
- రైతులతో ముందస్తుగా ఒప్పందం



(ఫైల్ ఫొటో)

మెదక్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మెతుకుసీమలో ఈ యాసంగి సీజన్‌లో ఊహించని విధంగా రైతులు సన్న వరి సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నుల సన్నధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో సన్నరకం బియ్యానికి మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు కన్నేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు పండించిన వడ్లను విక్రయించేందుకు సవాలక్ష ఆంక్షలు పెడతారని.. తాలు, తరుగు, తేమ శాతం లేకుండా తాము వడ్లు కొని వెంటనే డబ్బులు చెల్లిస్తామని రైతులకు ఆశ చూపుతున్నారు. మెదక్, పాపన్నపేట, రామాయంపేట, వెల్దుర్తి, హవేళిఘనపూర్, నిజాంపేట, కొల్చారం, కౌడిపల్లి, నర్సాపూర్, మాసాయిపేట, చేగుంట మండలాల పరిధిలో వ్యాపారులు రైతులను సంప్రదించి పొలాల వద్దనే వడ్లు కొనుగోలు చేస్తామని ఆకర్షిస్తున్నారు.

కల్లాలలోనే కొనుగోలు

ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో పెరిగిన సన్నాల సాగును తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు బ్రోకర్లు. బహిరంగ మార్కెట్‌లో సన్నా బియ్యానికి ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, మిర్యాలగూడ తదితర జిల్లాల దళారులు యోచిస్తున్నారు. కోతలు ప్రారంభమైన వెంటనే కల్లాల నుంచే ధాన్యాన్ని ఏకమొత్తంలో కొనుగోలుచేసి మిల్లులకు తరలించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. గత సంవత్సరం క్వింటాలు సన్న వడ్లకు రూ.2,500 చెల్లించిన దళారులు ఈసారి మరింతగా ధర పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

కేంద్రాల్లో మూడు కిలోల తరుగు

రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే తరగు పేరిట మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడం, శుభ్రం చేయడం, స్వంత వాహనాలపై కేంద్రాలకు తీసుకురావడాని ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని వాపోతున్నారు. కల్లాల్లోనే వడ్లను కొంటామని ముందుకు రావడంతో తరుగు, తేమశాతం, ఖర్చులు కలిసి వస్తాయని రైతులు వ్యాపారులకు విక్రయించడానికే మొగ్గుచూపుతున్నారు.

చివరి గింజ వరకు సేకరిస్తాం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



జోగిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్

జోగిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండించిన చివరి గింజ వరకూ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. జోగిపేట మార్కెట్‌యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. సన్నవడ్లు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని వెల్లడించారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని పేర్కొన్నారు. రూ. 130 కోట్లతో సింగూరు కాల్వలకు సిమెంట్ లైనింగ్ పనులను చేస్తున్నామని చెప్పారు.

శివపార్వతుల కల్యాణోత్సవంలో మంత్రి

జోగినాథ ఆలయంలో ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణానికి మంత్రి హాజరయ్యారు. జోగినాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్ ఆధ్వర్యంలో మంత్రి దామోదర్, ఎంపీ సురేశ్ షెట్కార్‌ను సన్మానించారు. అదనపు కలెక్టర్ మాధురి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, ఏఎంసీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జీఆర్ నరేందర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌గౌడ్, పట్లోల్ల ప్రవీణ్, డాకూరి వెంకటేశం, డాకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం

పుల్‌కల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి, 23 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్ అధ్యక్షతన జరిగిన సభకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. జిల్లాలో ఆరు ఆత్మ కమిటీలు ఉండగా ఇప్పటికే నాలుగు కమిటీల నియామకాలు పూర్తయ్యాయని, జహీరాబాద్, నారాయణఖేడ్ ఆత్మ కమిటీలను త్వరలో నియమిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుడు మొదలుకుని అన్ని స్థానాలకు కార్యకర్తలను గెలిపిస్తానని హామీ ఇచ్చారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో రూ.15 కోట్లతో సైన్స్ సెంటర్, అందోలులో ఫార్మసీ కళాశాల, పీజీ కళాశాల, ట్రామా సెంటర్‌ను నిర్మిస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఆర్డీవో పాండు, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు సుహాసినిరెడ్డి, అంజయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, రాజశేఖర్, లక్ష్మణ్, గోవర్ధన్, లక్ష్మారెడ్డి, రాములు, శ్రీహరి, సురేందర్‌గౌడ్, దేవదాస్, శ్రీనివాస్ రెడ్డి, రామాగౌడ్, కైసర్, రమేశ్, కృష్ణ, బాలగొండ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవలకు లైన్ క్లియర్

- ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ యాప్
- అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎస్పీడీసీఎల్
- అనుమతి నుంచి రిట్నర్ వరకు యాప్‌లోనే

7

కేన్సర్+కరోనా = కాంగ్రెస్

- బ్రిటిష్ జాతీయుడు స్థాపించిన పార్టీ అది
- రాహుల్‌గాంధీ మెప్పు కోసమే రేవంత్ ప్రగల్భాలు
- ఎమ్మెల్సీ అంజిరెడ్డి

7



కల్హేర్: నిజాంపేట మండలం బాచేపల్లిలో వద్ద రహదారిపై కూలిన చెట్టు



కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లిలో గాలికి ఎగిరిపోయిన పైకప్పు

గాలివాన.. ఆగమాగం

- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం
- విరిగిన చెట్లు.. నేల రాలిన మామిడికాయలు
- తడిసిన ధాన్యం.. తీగలపై పడిన కొమ్మలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- మరో రెండు రోజుల పాటు వర్షసూచన

మెదక్ అర్బన్/రేగోడు/రామాయంపేట/జోగిపేట రూరల్/కల్హేర్/నాగల్‌గిద్ద/నారాయణఖేడ్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గాలివానతో రైతులు హడలిపోయారు. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు, కలాల్లో ఆరుబోసిన ధాన్యం తడిచింది. తోటల్లో మామిడి నేలరాలింది. వానతో వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. మామిడితోటలలో కాయలు రాలిపోవడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. గాలి తీవ్రతకు చెట్లు, కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అల్లాదుర్గం, రేగోడ్, రామాయంపేట, రేగోడు, కల్హేర్ , నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, నిజాంపేట, అందులో మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాత నమోదైన మండలంగా సిర్గాపూర్ నిలిందచి. ఈ మండలంలో అత్యధికంగా 41.8మి.మీ., వర్షపాలం నమోదైంది. నాగల్‌గిద్దలో 29.5 మి.మీ., నారాయణఖేడ్‌లో 19.0 మి.మీ., న్యాల్‌కల్‌లో 19.0 మి.మీ., సంగారెడ్డిలో 14.0 మి.మీ., జహీరాబాద్‌లో 10.5., కంగ్టిలో 9 మి.మీ., కల్హేర్‌లో 6 మి.మీ., మనూరులో 5.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మెదక్ పట్టణంలో విద్యుత్ తీగలపై కొమ్మలు పడడంతో గంట పాటు సరఫరా నిలిచిపోయింది. అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో పంచాయతీ కార్యాలయంపై పిడుగు పడడంతో ఎలక్ట్రానిక్ పరికరాలు పాడయ్యాయి. కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట మండలాల్లో గురువారం సాయంత్రం కొంత సేపే ఈ బీభత్సం కొనసాగినా తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లి గ్రామంలో రేకుల షెడ్డు ఎగిరి ఇతరుల ఇండ్లపై పడ్డాయి. అలాగే బాచేపల్లి ఎంజేపి పాఠశాలపైన ఉన్న రేకుల షెడ్డు ఎగిరిపోయి రేకులు కింద పడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు బయట లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మనూరు మండలం డోవూరులో పిడుగు పాటుకు గేదె మృతి చెందింది. నారాయణఖేడ్‌లో రాయిపల్లి రోడ్డులో గల రొలెక్స్ హోటల్‌లో జనాలు భోజనం చేస్తున్న సమయంలో ఒక్క సారిగా గాలి వానతో పైకప్పు కూలి పోవడంతో జనాలు భయభ్రాంతులు గురైన బయటకు పరుగులు పెట్టారు.





నారాయణఖేడ్‌లో రహదారిపై నిలిచిన వర్షపు నీరు, కూలిన హోటల్ పైకప్పు పెంకులు

పెండింగ్‌లో 'బాస్' బిల్లులు

- మూడేళ్లుగా మంజూరు కాని నిధులు
- సిద్దిపేట జిల్లాలో ఆరు పాఠశాలలు
- రూ.4.73 కోట్లు మంజూరు కాకపోవడంతో
- పాఠశాలల యాజమాన్యానికి ఇబ్బందులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్(బాస్)కు మూడేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో పాఠశాలలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేమితో సతమతమవుతున్నామని పాఠశాల యాజమాన్యాలు ఇప్పటికే నిరసన బాట పట్టాయి.

సిద్దిపేట జిల్లాలో ఆరు పాఠశాలలను బెస్ట్ అవైలబుల్ కింద ఎంపిక చేశారు. సిద్దిపేటలో వికాస్, శ్రీవాణి, బ్రిలియంట్ హైస్కూళ్లు, బెజ్జంకిలో విద్యానికేతన్, గజ్వేల్‌లో శ్రీసాయి, సెంట్‌మేరీస్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వసతితో పాటు డేస్ స్కాలర్‌లకు ఈ పథకం ద్వారా అవకాశం ఉంది. హాస్టల్ విద్యార్థికి సంబంధించి ఒక్కో విద్యార్థికి రూ.42,000, డే స్కాలర్‌కు సంబంధించి రూ.28,000 చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల కోసం ప్రభుత్వం ఏటా కొన్ని నిధులను విడుదల చేస్తోంది. మూడేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు ఆందోళనకు గురవుతున్నాయి. నిధుల విషయమై నిరసన తెలిపి గతంలో చాలాసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది.

అందుబాటులో లేని అధికారి

ఆరు పాఠశాలలలో 2021 - 22 సంవత్సరానికి గానూ 398 విద్యార్థులు, 2022-23 సంవత్సరానికి గానూ 485 విద్యార్థులు, 2024-25 సంవత్సరానికి 578 విద్యార్థులు ఈ పథకం కింద ఎంపికయ్యారు. 2022 సంవత్సరానికి రూ.1.90 కోట్లు, 2023 సంవత్సరానికి రూ.2 కోట్లు, 2024 సంవత్సరానికి రూ.83 లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా రూ.4.73 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. అయితే, ఇందులో రూ.70 లక్షల నిధులను మంజూరు చేసినప్పటికీ ఇంకా పాఠశాలల అకౌంట్‌లలో జమ కాలేదు. సిద్దిపేట జిల్లా ఎస్సీడీడీ అధికారి రెండు నెలల నుంచి సెలవులపై ఉందని తెలిసింది. ఇన్‌చార్జి అధికారి కూడా అందుబాటులోకి రాలేదు. కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు సంబంధించి ప్రతీ ఏటా జిల్లా కార్యాలయం నుంచి ప్రభుత్వానికి రికార్డు పంపుతున్నామని, సర్కారు నుంచే నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.



బాస్ పథకానికి ఎంపికైన సిద్దిపేటలోని పాఠశాల

పాఠశాలలను నిర్వహించలేకపోతున్నాం

ఒక్కో పాఠశాలకు లక్షల రూపాయలు పెండింగ్‌లో ఉండడం వలన పాఠశాల నిర్వహణ భారంగా మారుతోందని యాజమాన్యాలు వాపోతున్నాయి. నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో వందల సంఖ్యలో పాఠశాలలు ఉన్నప్పటికీ తమ పాఠశాలలను ఎంపిక చేయడం, నిధులు మంజూరు చేయకపోవడం ఎంతో ఇబ్బందిగా ఉందని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి విద్యార్థులకు, యాజమాన్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు కోరుతున్నారు.

అట్టహాసంగా కీర్తన, నగర ప్రదక్షిణ

నారాయణఖేడ్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని పురాతనమైన రామాలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా గురువారం నగర ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. మహిళలు కలశాలు, తులసీ కోటలు తలలపై ఉంచి, పట్టణంలో హరినామ కీర్తన చేస్తూ ప్రదక్షిణ చేశారు. అనంతరం అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతిమహరాజ్ కీర్తన నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం.. సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్



రాజుకు సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ విష్ణువర్ధన్

శివ్వంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని ఓ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఘటన గురువారం శివ్వంపేట మండల పరిధిలోని దేవమ్మగూడెం తండాలో చోటు చేసుకున్నది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దేవమ్మగూడెం తండాకు చెందిన లూస్నావత్ రాజు(30) దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం మద్యం తాగి కుటుంబసభ్యులతో గొడవకు దిగగా, వారు మందలించారు. దీంతో ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి, ఇంట్లో బెడ్రూంకు వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కుటుంబీకులు 108కు కాల్ చేయగా వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్ తలుపులు ధ్వంసం చేసి ఉరేసుకుని స్పృహ కోల్పోయిన రాజుకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. దీంతో పోలీసులకు రాజు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు చిక్కాడు

- వ్యాపారులకు, పోలీసులకు కునుకు లేకుండా చేసిన నిందితుడి అరెస్ట్
- రెండుసార్లు జైలుకెళ్లినా మారని తీరు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : హమ్మయ్యా.. దొంగ దొరికాడు.. వ్యాపారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. సంగారెడ్డి పట్టణంలో నెల రోజులుగా వివిధ వ్యాపార సంస్థల్లో దొంగతనాలకు పాల్పడుతూ ఇటు వ్యాపారులకు, అటు పోలీసుల కంటికి కునుకు లేకుండా చేసిన దొంగను సంగారెడ్డి పట్టణ పోలీసులు ఎట్టకేలకు గురువారం పట్టుకున్నారు. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఇబ్రాహీంబాద్ తండాకు చెందిన ముడావత్ అంజా(26) చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సంగారెడ్డిలోని వీరభద్రనగర్‌లో ఒక అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మార్చి 26న రాత్రి 11 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని కేశవ మెడికల్ షాప్, కేశవ పాలిక్లినిక్‌లో టివిని, రూ.60 వేల నగదు దొంగిలించాడు. మార్చి 30న రాత్రి 11 గంటల ప్రాంతంలో కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న అశోక్ కిరాణషాప్‌లో లైఫ్‌బాయ్ సబ్బులు, పారాచ్యూట్ ఆయిల్, ఐదు లీటర్ల వంటనూనె, మరికొన్ని వస్తువులు చోరీ చేశాడు. ఈనెల 7న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా ఉన్న స్మార్ట్‌ఫ్యాషన్ డ్రెస్సుల షాపులో నగదుతో పాటు దుస్తులను దొంగతనం చేశాడు. గురువారం ఉదయం సిమ్లా బేకరీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా నిందితుడు అంజాను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. అంజా నుంచి రూ.1370 నగదు, ఐదు లీటర్ల సన్‌ఫ్లవర్ ఆయిల్, నాలుగు లైఫ్‌బాయ్ సబ్బులు, 175 మి.లీ. పారాచ్యూట్ ఆయిల్, ప్లాస్టిక్ టిన్స్ పది స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రాహీంబాద్ తండాకు చెందిన ముడావత్ అంజా(26) తండ్రి గన్య లివర్ వ్యాధితో 2020లో చనిపోయాడు. తల్లి సక్కుబాయి మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. దీన్ని సహించని అంజా తల్లి సక్కుబాయిని గతేడాది హత్య చేశాడు. ఈ కేసులో జైలుకు వెళ్లి తిరిగి బెయిల్‌పై బయటకు వచ్చాడు. తర్వాత నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసి ఈఏడాది ఫిబ్రవరి 13న మళ్లీ జైలుకు వెళ్లాడు. మార్చి 5న విడుదలయ్యాడు. మార్చి 11న తన భార్య స్వాతికి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించి తన తల్లిగారింటి వద్ద దింపాడు. సంగారెడ్డిలోని వీరభద్రనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ పట్టణంలో దొంగతనాలకు పాల్పడ్డాడు. చివరకు పోలీసులకు చిక్కి మరోసారి జైలుకు వెళ్లాడు.

ఏఐతో ఉజ్వల భవిష్యత్తు

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేధతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో హత్నూర అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆమె గురువారం పది కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏఐ ఆధారిత విద్యాబోధనను ప్రారంభించాలనే ఉద్దేశంతో విద్యార్థులు ఎక్కువగా ఉన్న 15 పాఠశాలలను ఎంపిక చేసి వాటికి కంప్యూటర్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, సెక్టోరియల్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రేసా అధ్యక్షుడు గంగాధర్, సెక్రటరీ కిరణ్, కార్యవర్గసభ్యులు, ఏవో, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు మృతి

కొల్చారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా ఓ రైతు మృతిచెందిన సంఘటన జోగిపేట ప్రధాన రహదారి ఎనగండ్ల శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో రంగంపేట గ్రామానికి చెందిన ఊరడి ఎల్లయ్య(55) సాయంత్రం పొలానికి వెళ్లి, గడ్డి కోసి మూటను నెత్తిపై పెట్టుకుని రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో దుంపలకుంట చౌరస్తా నుంచి వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనం ఎల్లయ్యను ఢీకొట్టింది. రోడ్డుపై పడ్డ ఎల్లయ్య తల వెనుక భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావమైంది. దీంతో అతన్ని ప్రైవేట్ వాహనంలో వైద్యం కోసం మెదక్ తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో మృతిచెందాడు. ఎల్లయ్యకు భార్య కూతురు, కుమారుడు ఉన్నారు. ఎల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కుకునూరుపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఓ కుటుంబం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా కారు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టడంతో బాలుడు మృతిచెందిన సంఘటన లకుడారం రాజీవ్ రహదారిపై చోటుచేసుకున్నది. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన కథనం మేరకు.. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన బాబీ కుటుంబ సభ్యులు గురువారం ఉదయం వేములవాడ ఆలయానికి వెళ్లి దైవ దర్శనం చేసుకుని మధ్నాహ్నం తిరిగి వస్తున్నారు. మండలంలోని లకుడారం శివారులో రాజీవ్ రహదారిపై కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా, బాబి కుమారుడు కార్తీక్(8) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వారిని పోలీసులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

జోగిపేట రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మన్సాన్‌పల్లి గ్రామ శివారులో గురువారం నాడు చోటుచేసుకున్నది. జోగిపేట ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్ మండలం మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి కిష్టయ్య గ్రామ సమీపంలోని చెరువులో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కిష్టయ్య మృతదేహాన్ని గురువారం బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

కోహీర్ ఏప్రిల్ 10: (ఆంధ్రజ్యోతి) కడుపునొప్పి బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోహీర్ మండలంపరిధిలో చోటుచేసుకున్నది. కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్‌వర్మ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తూరు(కే) గ్రామానికి చెందిన బెస్ట్ జనార్దన్(58) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికిని తగ్గలేదు. బుధవారం మధ్యాహ్నం కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జనార్దన్ భార్య అనుషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపతి సతీష్ వర్మ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

హవేళిఘణపూర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఔరంగాబాద్ గ్రామానికి చెందిన ఆడెపు ధన్‌రాజ్(33) వ్యవసాయం చేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులకు తాళలేక మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఇంటికి వచ్చిన కుటుంబీకులకు కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. ధన్‌రాజ్ తండ్రి సిద్ధిరాములు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ధన్‌రాజ్‌కు భార్య, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు.

హైవే 161పై గంటల వ్యవధిలోనే రెండు రోడ్డు ప్రమాదాలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 10. (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని 161వ జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్ల దూరంలోనే గురువారం ఉదయం గంటల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాల్లో చోటుచేసుకున్నాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం పెద్దశంకరంపేట వైపు కారులో వెళ్తున్న క్రమంలో అల్లాదుర్గంలోని సబ్‌స్టేషన్ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే, మండలంలోని కాయిదంపల్లి గ్రామ శివారులో హైదరాబాద్ నుంచి పెద్దశంకరంపేట వైపు వెళ్తున్న బొల్లెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఈ వాహనంలో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

తారా కళాశాలలో ముగిసిన జాతీయ సెమినార్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'పబ్లిక్ పాలసీని రూపొందించడంలో సామాజిక శాస్త్ర పాత్ర- బహుళ విభాగ దృక్పథం' అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ గురువారం ముగిసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, సదరన్ రీజినల్ సెంటర్ వారి ఆర్థిక సహకారంతో నిర్వహించిన సెమినార్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశోధకులు టెక్నికల్ సెషన్స్‌లో తమ పరిశోధనా పత్రాల ద్వారా పబ్లిక్ పాలసీ ఏ విధంగా ఉండాలి, రూపకల్పనలో సామాజిక శాస్త్రాల పాత్ర ఏమిటి, అభివృద్ధికి, పబ్లిక్ పాలసీకి మధ్య వైరుధ్యాలు ఏ విధంగా ఉన్నాయి, వాటి మధ్య అంతరాలను తొలగించుటకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. పరిశోధకులు రాజకీయ నిర్ణయాలు, వాటి అమలు విధానాలు సరియైన విధంగా ఉండేటట్టు పబ్లిక్ పాలసీ ఉండాలని, పబ్లిక్ పాలసీ రూపకల్పనలో ఆర్థిక వనరులు, రాజకీయ నిర్ణయాలు, పాలనాపరమైన అడ్డంకులు, దానికి ఉన్న చారిత్రక నేపథ్యాలు మొదలగు వాటిని పరిగణలోకి తీసుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్ఎస్ఆర్ సదరన్ రీజినల్ సెంటర్ హానర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి, గోపినాథ్‌రెడ్డి, రాములు, కమ్రోద్దిన్, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, సెమినార్ కన్వీనర్ మల్లిక, జగదీశ్వర్, నిర్మల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు తగవు

- బహిరంగ క్షమాపణ చెప్పాలి
- సీఎం, డిప్యూటీ సీఎం అధికారాలను కుక్క తోకతో పోల్చడంపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం
- పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ లబ్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై మాజీ మంత్రి హరీశ్‌రావు రుద్రారం గణేష్ ఆలయం వద్ద చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రజల ఓట్లతో గెలిచిన సీఎం, ఉపముఖ్యమంత్రిపై హరీశ్‌రావు చేసిన అభ్యంతకరమైన వ్యాఖ్యలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 'రాష్ట్రంలో అధికారం ఎవరు చలాయిస్తున్నారో తెలియడం లేదని, కుక్క తోకను ఊపుతోందా.. తోక కుక్కను ఆడిస్తుందా' అని హరీశ్‌రావు పేర్కొనడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. సీఎం, దళిత డిప్యూటీ సీఎంను కుక్కతోకతో పోల్చడం హరీశ్‌రావు వివేకానికే వదిలివేస్తున్నామన్నారు. వెంటనే హరీశ్‌రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, ఉపాధ్యక్షుడు యువరాజ్, నాయకులు అశోక్‌ముదిరాజ్, సాయిలు, జాన్సన్, అక్షిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవలకు లైన్ క్లియర్

ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ యాప్

అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎస్పీడీసీఎల్

అనుమతి నుంచి రిట్నర్ వరకు యాప్‌లోనే



మెదక్ అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల్లో మానవ తప్పిదాలు, ప్రమాదాల నివారణతోపాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ సంస్థ ప్రత్యేకంగా ఆన్‌లైన్ లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించింది. ఎల్‌సీ తీసుకొని పనులు చేపడుతున్న సమయంలో ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్ ఎంచుకోవడం, సమాచార లోపం తదితర కారణాలతో ఉద్యోగులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని నివారించేందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

యాప్‌లోనే అన్నీ..

ఇక నుంచి విద్యుత్ సిబ్బంది లైన్ క్లియర్ యాప్‌ను తప్పక ఉపయోగించాలి. విద్యుత్ సరఫరా పనులకు ఎల్‌సీ తీసుకోవాలనుకునే లైన్‌మన్ ముందుగా యాప్‌ను ఓపెన్ చేసి అందులో సంబంధిత ఫీడర్‌లో ఏఈకి విన్నవించాలి. ఏఈ లైన్‌మన్ రిక్వెస్ట్‌ను పరిశీలించి ఆ ఫీడర్‌లో ఎల్‌సీ ఇవ్వొచ్చా, లేదా.. అత్యవసరమా.. మరే ఇతర షెడ్యూల్ చేయబడిన పనులు ఉన్నాయా అని ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే ఏఈ యాప్ ద్వారానే అనుమతి ఇస్తారు. ఇదే యాప్ ద్వారా సంబంధిత లైన్‌మన్‌కి సమాచారం వెళ్తుంది. అలాగే సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్ ఇవ్వాలో యాప్ ద్వారా తెలుస్తోంది. ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఏమరపాటుగా చేసే పొరపాట్లను నివారించుటకు యాప్ తగు సూచనలు, జాగ్రత్తలు తెలియజేస్తోంది. హెల్మెట్ పెట్టుకోవాలని, హ్యాండ్‌గ్లౌజ్ వేసుకోవాలని, ఎర్త్ రాడ్ వేయాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అన్న విషయాలను యాప్ గుర్తు చేస్తోంది. వీటన్నింటినీ సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ ఫొటోను యాప్ ద్వారా లైన్‌మెన్ చూసుకుని అందులో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అని ధ్రువీకరించుకుని పనికి ఉపక్రమించాల్సి ఉంటుంది. లైన్‌మన్ ఎంత మంది సిబ్బంది చేత పని చేయిస్తున్నారో వారి పేర్లను యాప్‌లో పొందుపర్చాలి. పని పూర్తికాగానే ఆ పనికి సంబంధించిన ఫొటో, సిబ్బంది వచ్చారా లేదా అని యాప్‌లో నమోదు చేసి, ఎల్‌సీ రిట్నర్ చేయాలి. ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిట్నర్ ఆదేశాలు వెళ్తాయి. అప్పుడు సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఎల్‌సీ రిట్నర్ చేసే సమయంలో ఎర్త్‌రాడ్ తీసారా, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అని యాప్ అడుగుతోంది. ఏఈ ఆదేశాల మేరకు ఆ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. ఇప్పటికే విద్యుత్ ఉద్యోగులకు, సిబ్బందికి ఈ యాప్ పనిచేసే విధానంపై శిక్షణనందించారు.



భద్రతా ప్రమాణాలు పెంచడానికి యాప్



విద్యుత్ వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా భద్రతా ప్రమాణాలను పెంచడానికి ప్రత్యేకంగా ఎల్‌సీ యాప్‌ను టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ రూపొందించింది. ఎల్‌సీ యాప్ ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాలు, మానవ తప్పిదాలను నివారించవచ్చు. అలాగే అనవసరమైన ఎల్‌సీలను తగ్గించవచ్చు.

- శంకర్, ఎస్ఈ మెదక్

కేన్సర్+కరోనా = కాంగ్రెస్

- బ్రిటీష్ జాతీయుడు స్థాపించిన పార్టీ కాంగ్రెస్
- రాహుల్‌గాంధీ మెప్పు కోసమే రేవంత్ ప్రగల్భాలు
- ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, కరోనా కలిస్తే కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి విమర్శించారు. సంగారెడ్డి శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీపై రేవంత్‌రెడ్డి గుజరాత్‌లో చేసిన ఆరోపణలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఓ బ్రిటిష్ జాతీయుడు కాంగ్రెస్ పార్టీని స్థాపించిన విషయం సీఎం మర్చిపోయినట్టు ఉన్నాడని ఎద్దేవా చేశారు. చరిత్ర మర్చిపోయి విమర్శలు చేయడం తగదన్నారు. తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనీయబోమని రేవంత్‌రెడ్డి మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు, నిన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలు బీజేపీకి ప్రజలు పట్టం కట్టారని అంజిరెడ్డి గుర్తుచేశారు. సాక్షాత్తు తన సొంత జిల్లాలోని ఎంపీ స్థానాన్ని, ఆయన సిట్టింగ్‌గా ఉన్న మల్కాజ్‌గిరి ఎంపీ సీటులో బీజేపీ ఘన విజయం సాధించిందన్నారు. సొంత జిల్లాలో ఎంపీ స్థానాన్ని గెలిపించుకోలేని అసమర్థుడు రేవంత్ అని అన్నారు. జాతీయవాద, దేశభక్తి భావాలు కలిగిన బీజేపీపై అవాకులు, చవాకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మజ్లిస్, బీఆర్ఎస్‌తో కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టలేదని, అయినప్పటికీ బీజేపీ విజయం తథ్యమన్నారు. బీజేపీపై రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు విమర్శలు మానుకొని ఆరు గ్యారెంటీల అమలు, ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అంజిరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమాలు చేయాలని పార్టీ పిలుపునిచ్చిందని, ప్రతీ కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటనరసింహారెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మీనాగౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం

ఇందుప్రియాల్, మంగంపేటలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

దౌల్తాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందుప్రియాల్ గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం స్వామివారు రథంపై ఊరేగారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. రాములోరి రథోత్సవం గ్రామ పురవీధుల గుండా ముందుకు సాగగా, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్త అన్నారెడ్డి సుభాష్‌రెడ్డి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించి రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామల కుమార్, ఎంపీటీసీ వీరమ్మ మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు..



జిన్నారం : రథోత్సవంలో నాయకులు, భక్తులు

మంగంపేటలో..

జిన్నారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మంగంపేటలో గురువారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామ ప్రధాన వీధుల్లో రథోత్సవం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశం గౌడ్, రాజేష్, గంగు రమేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గణేష్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: ఇందుప్రియాల్‌లో రథాన్ని లాగుతున్న ఆలయ చైర్మన్ సుభాష్‌రెడ్డి, భక్తులు

సింహవాహనంపై లక్ష్మీనరసింహస్వామి

బెజ్జంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి సింహవాహన సేవను నిర్వహించారు. అర్చకులు ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని సింహవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మంగళహారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.



బెజ్జంకిలో పురవీధుల్లో సింహ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు



కారముంగిలో కుస్తీ పోటీలు

మండల పరిధిలోని కారముంగి గ్రామంలో మహాదేవ జాతర ఉత్సవాలలో భాగంగా గురువారం కుస్తీ పోటీలను నిర్వహించారు. -నాగల్‌గిద్ద, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు పింఛన్ పెంచారు.. రేవంత్‌రెడ్డి ఇవ్వకపోతే

గద్దె దిగిపోయే రోజు తీసుకువస్తా

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

చేర్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో సీఎం చంద్రబాబు పింఛన్ల పెంపుపై చిత్తశుద్ధి చాటుకున్నారని, కానీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పక్కవారిపై నిందలు మోపుతూ కాలం వెల్లదీస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రేవంత్ ఇక్కడ పింఛన్ పెంచి ఇవ్వకపోతే తప్పక తప్పక గద్దె దించే రోజు తీసుకువస్తానని అన్నారు. చేర్యాల మండలం షబాషీగూడెం గ్రామంలో గురువారం రాత్రి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల హామీ మేరకు చంద్రబాబు జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన పింఛన్ డబ్బులు అందిస్తున్నారన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి 16 నెలలైనా రూ.4వేలు పింఛన్ అమలు చేయలేదన్నారు. పేదలకు మేలు జరగాలని తాను చేసే ఏ పోరాటానికైనా ప్రజలు అండగా నిలబడాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, వర్గీకరణ పోరాటం కేవలం మాదిగల కోసమే కాదని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు అందరి దరిచేరడం కోసమేనన్నారు. తాము మాలలు, రెడ్లు, అగ్ర వర్ణాలకు వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల సహకారంతో వర్గీకరణ సాకారమైందన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'మేమేంతో మాకంత' నినాదం ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. తెలంగాణ ఉద్యమం మాదిరిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, నిర్బంధాలకు గురైనా వెనకడుగు వేయకుండా మూడు దశాబ్దాలుగా చేపట్టిన పోరాటం ఫలించడం హర్షించదగిందన్నారు. అసమానతలు తొలగి దళితుల జీవితాలలో వెలుగులు నింపిన సూర్యుడుగా నిలిచిన మంద కృష్ణ పోరాటం ఎందరికో ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, సీపీఎం జిల్లా నాయకుడు కొంగరి వెంకట్‌మావో, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



షబాషీగూడెంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంద కృష్ణమాదిగ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

బాబు జగ్జీవన్‌రామ్ బాటలో నడవాలి

కుకునూరుపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్ బాటలో నడవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. బుధవారం చిన్నకిష్టాపూర్ గ్రామంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గకరణ జరిగిందని వర్గీకరణతో మాదిగలకు న్యాయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముంద్రాతి కృష్ణ, లక్ష్మణరాజు, మాజీ సర్పంచ్ కనకయ్య, కిషన్, సోమీ కరుణాకర్, సంపత్‌రెడ్డి, సంతోష్‌చారి, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పంట కాలువ మరమ్మతు

రాయరావు చెరువు కాలువకు ఆక్రమణల నుంచి రక్షణ..వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభం



వ్యర్థాలతో అధ్వానంగా రాయరావు చెరువు పంట కాలువ, మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీఈఈ, ఏఈ

నర్సాపూర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణ పరిధిలోని రాయరావు చెరువు పంట కాలువ మరమ్మతుకు నిధులు మంజూరైన ఎన్నో ఏళ్ల తర్వాత పనులకు మోక్షం లభించింది. ఎట్టకేలకు వ్యర్థాలను తొలగించి, సిమెంట్ పనులను ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో అతిపెద్ద చెరువులో ఈ చెరువు ఒకటి. దీని కింద ఐదువందల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, చెరువు నుంచి సాగునీరు పారే పంట కాలువ ఇళ్ల మధ్య నుంచి ఉండటంతో ఆక్రమణకు గురవుతూ వచ్చింది. అంతేకాకుండా ఇళ్ల నుంచి డ్రైనేజీతో పాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కాలువలోనే వేస్తుండటంతో మురుగు కాల్వగా తయారైంది. ఇన్నాళ్ల నిర్వాహణ లేక కుచించుకపోయి పంటలకు సాగు నీరందించలేకపోయారు. ఆరేళ్ల క్రితం పంట కాలువ ఆక్రమణ గురికాకుండా, వ్యర్థాలు చేరకుండా పటిష్ట చర్యలు చేపట్టడానికి రూ.13 లక్షల నిధులను మంజూరు చేశారు. వివిధ కారణాలతో నిధులు కాంట్రాక్టు పనులను ప్రారంభించ లేదు. 'ఆంధ్రజ్యోతి'లోనూ ఈ విషయమై గతంలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్థానికులు, రైతుల నుంచి విమర్శలు వస్తుండటంతో ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు స్పందించి పనులను చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కాలువకు ఆర్‌సీసీ వేయడమే కాకుండా ఆక్రమణల నుంచి రక్షణగా ఇరువైపులా పెన్సింగ్ వేస్తున్నారు. ఎన్నో రోజులుగా పట్టించుకోకుండా అధ్వానంగా మారిన కాలువ మరమ్మతు పనులకు మోక్షం లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కాలువ పనులను డీఈఈ బుచ్చిబాబు, ఏఈ మణిభూషన్ పరిశీలించారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను పడేయొద్దు

- తడి, పొడి చెత్తను వాహనానికి ఇవ్వాలి
- సిద్దిపేట డీపీవో దేవకీదేవి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వినియోగించిన ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా పారేస్తున్నారని, అలా చేయడం వల్ల అనేక అనర్థాలు తప్పవని సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) దేవకీదేవి తెలిపారు. గురువారం ఆమె నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, మల్యాల గ్రామాల్లోని డంపింగ్ షెడ్లు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇంట్లోని తడి, పొడి చెత్తను గ్రామ పంచాయతీకి చెందిన చెత్త వాహనానికి అందజేయాలని చెప్పారు. తద్వారా రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. నర్సరీల్లో త్వరగ పెరిగే మొక్కలకు పెంచి ప్రజలకు అందించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆరోగ్యపరంగా మేలు చేసే మునగ, బొప్పాయి, వంగ మొక్కలు కుడా పెంచాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శులు మునీరుద్దీన్, అరుణ తదితరులు ఉన్నారు.



గుర్రాలగొందిలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీపీవో

న్యూస్ బాక్స్

బకాయి వేతనాల కోసం ఎంపీడీవోకు వినతి

హత్నూర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నాలుగునెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, బకాయి వేతనాలు వెంటనే ఇప్పించాలని హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామపంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీవో శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శంకరయ్య, దుర్గమ్మ, లక్ష్మీ, స్వరూప, జయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి'

జిన్నారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం పరిధిలోని సర్వే నెంబరు 27లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకుడు నాయకులు బాలయ్య గురువారం తహసీల్దార్ భిక్షపతిని కోరారు. పేదలు నిర్మించుకుంటున్న నివాసాల వద్ద కొందరు ఆక్రమణలకు పాల్పడుతూ పనులకు అడ్డుతగులుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల మంబోజిపల్లి ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో నీలకంఠం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. రేపటి నుంచి ప్రారంభం కాబోయే ప్రాథమిక పాఠశాల వార్షిక పరీక్షల పేపర్ల గురించి ఆరాతీశారు. విద్యార్థుల ప్రతిభను చదివించడం, రాయించడం ద్వారా స్వయంగా తెలుసుకొన్నారు.

మల్లన్న జాతర ప్రారంభం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలోని గురువారం మల్లన్న జాతర ప్రారంభమైంది. ఒగ్గు పూజారులు మల్లన్నకు బండారు, కుంకుమ తదితర పూజలను నిర్వహించారు. పట్నం పూజ, పటణ పూజ, గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు, పూజలు చేశారు.

రెయిన్ వెదర్ స్టేషన్ల పరిశీలన

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మ్యానువల్ రెయిన్ వెదర్ స్టేషన్‌ను జిల్లా ప్రణాళిక అధికారి బద్రినాథ్ గురువారం పరిశీలించారు. రాష్ట్ర సంచాలకులు అర్థ గణాంక శాఖాధికారుల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోని మ్యానువల్ రెయిన్ వెదర్ స్టేషన్లు పరిశీలిస్తున్నామన్నారు.

నర్సాపూర్ ఎక్సైజ్ సీఐగా గోపాల్

నర్సాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఎక్సైజ్ సీఐగా జిల్లా టాస్క్‌ఫోర్సు సీఐ గోపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. నర్సాపూర్ ఎక్సైజ్ సీఐగా పనిచేసిన పద్మ బదిలీపై నల్గొండకు గతనెల వెళ్లగా.. ఆమె స్థానంలో స్థానిక ఎక్సైజ్ ఎస్ఐ అజీజ్‌కు బాధ్యతలు అప్పగించి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఎవరూ రాకపోవడంతో తాత్కాలికంగా టాస్క్‌ఫోర్సు సీఐ గోపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేయండి

నర్సాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖులైన అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రాం, వివేకానంద విగ్రహాలను చెరువు కట్టపై ఏర్పాటు చేయాలని ప్రముఖ సంఘ సేవకుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ పైడిశ్రీధర్ గుప్తా అన్నారు. నర్సాపూర్‌లో గతంలో ప్రధానరోడ్డుపై ఉన్న ప్రముఖుల విగ్రహాలు జాతీయ రోడ్డు విస్తరణ సందర్భంగా తొలగించినా.. వాటిని అనువైన స్థలంలో ఏర్పాటు చేయకుండా చిల్డ్రన్స్‌పార్కులో ఉంచడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి వస్తున్న సందర్భంగా నాయకులు, అధికారులు చొరవ తీసుకుని కనీసం చెరువు కట్టపైన అయినా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వంట గ్యాస్ ధర పెంచడం దారుణం

నర్సాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ వంటగ్యాస్ రూ.50 పెంచడంతో పాటు పెట్రోల్, డీజిల్‌పై ప్రత్యేకంగా ఎక్సైజ్ సుంకాన్ని విధించడాని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

హనుమాన్ జయంతి

తూప్రాన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని పెద్దచెరువు కట్టపై వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హన్‌మత్ జయంతి ప్రారంభమైంది. మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు కార్యనిర్వాహకులు శలాక ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో గురువారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఆఖండ దీపారధన, అంకురార్పణ, సుందరకాండ, గురుచరిత్ర పారాయణం, మన్యుపాశుపదం పూజ కార్యక్రమాలు నిర్వహించారు.





మానేపల్లి వంతెనకు ఇరువైపులా ధ్వంసమైన రక్షణ దిమ్మెలు, మేల్లూరు నుంచి కొప్పులపల్లి రోడ్డుపై రక్షణ దిమ్మెలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన

ప్రమాదకరంగా వంతెనలు

- రక్షణ దిమ్మెలు లేక ప్రమాదాలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

వెల్దుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై వాగులు, కాల్వలపై నిర్మించిన వంతెనలు, కల్వర్టులు రక్షణ దిమ్మెలు లేక ప్రమాదకరంగా మారాయి. దీంతో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని మానేపల్లి గ్రామ పరిధిలో 30 ఏళ్ల క్రితం వాగుపై వంతెన నిర్మించారు. వంతెనకు ఇరువైపులా రక్షణగా ఉండడానికి ఓ వైపు ఇనుప పైపులతో గద్దెలను, మరోవైపు ఇనుప రాడ్డులతో పిల్లర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ పైపులను దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే పిల్లర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వెల్దుర్తి నుంచి కొప్పులపల్లి వెళ్లే మార్గాల్లోని వంతెన ధ్వంసమైంది. ఇరువైపులా ఉన్న రక్షణ దిమ్మెలు విరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి వంతెనలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం అంచున..



కొన్నేళ్ల కిత్రం మేల్లూరు వంతెన రక్షణ దిమ్మెలు విరిగిపోయాయి. ఇప్పటివరకు పట్టించుకునే వారే లేకుండాపోయారు. ప్రమాదం అంచున ప్రయాణం చేస్తున్నాం. అధికారులు స్పందించి రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలి.

\- శ్రీధర్‌గౌడ్, మేల్లూరు

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయం

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌కల్చరల్/నిజాంపేట/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యంతో పేదల కడుపునింపడమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. గురువారం మెదక్ మండల బాలనగర్ గ్రామంలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించి, సన్నబియ్యం లబ్ధిదారుడు కాట్రోత్ శివ ఇంట్లో సహపంక్తి భోజనం చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో మొదటిసారి సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడం ధ్యేయంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకుపోతున్నామని చెప్పారు. అనంతరం నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, అధికారులు, మండల నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో రూ.2.37 కోట్లతో నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులకు ఎమ్మెల్యే రోహిత్‌రావు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, గరుత్మంతరాజ్, ఏడీఈ ఆదయ్య, ఏఈ గణేష్, మాజీ సర్పంచులు ముత్యంరెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామాభివృద్ధితో పాటు నూతన పంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు బందెల సాయి ఆధ్వర్యంలో నాయకులు శ్రీశైలం, రామకిష్టరెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు ఎమ్మెల్యే రోహిత్‌రావును హైదరాబాద్‌లోని స్వగృహంలో కలిసి విన్నవించారు.

రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలి

రామాయంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పాత హైవే నుంచి డబుల్ కాలనీ వెళ్లే రోడ్డు పనుల అడ్డంకులు తొలగించాలని కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు విన్నవించారు. సుమారు కిలోమీటర్ మేర రోడ్డుకు రూ.కోటి మంజూరవగా ఇటీవల ఎమ్మెల్యే చేతులమీదుగా శంకుస్థాపన జరిగింది. రోడ్డు కొలతలు చేసే క్రమంలో పలువురు రైతులు ఆటంకాలు సృష్టించారు. దీంతో పనులకు ఇబ్బందులు ఏర్పడి నిర్మాణానికి ఆలస్యం జరిగే అవకాశం ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అక్కడే ఉన్న టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌కు సమస్య పరిష్కరించాలని సూచించారు.



సన్నబియ్యం లబ్ధిదారుడు కాట్రోత్ శివ ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

తాగునీటి సమస్య పరిష్కరించాల్సిందే..

- ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయింపు
- గంటపాటు ధర్నా, రాస్తారోకో

హత్నూర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సిరిపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు గురువారం దౌల్తాబాద్-జోగిపేట రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. కొద్దిరోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరిపోను రాకపోవడంతో, నల్లాల ద్వారా ఇళ్లలోకి నీరు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గుక్కెడు నీళ్ల కోసం ఆరుబయట వ్యవసాయ కుళాయిలను ఆశ్రయించాల్సి వస్తుందని అన్నారు. పలుమార్లు గ్రామ కార్యదర్శి, అధికారుల దృష్టికి తీసుకుపోయినా లెక్క చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించికూర్చున్నారు. రాస్తారోకో వల్ల వాహనాలు గంటపాటు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఆందోళనకారుల వద్దకు వెళ్లి పలు విధాలుగా నచ్చజెప్పారు. వేసవి ముగిసేవరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అయ్యేలా చూసానని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.



సిరిపురంలో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

పది మూల్యాంకన భత్యం పెంచాలి

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి మూల్యాంకనం భత్యం ఏడేళ్ల క్రితం నిర్ణయించిన భత్యాన్ని నేటికీ చెల్లిస్తున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. గురువారం రామచంద్రాపురం పది మూల్యాంకన కేంద్రంలో నిరసన తెలిపి మాట్లాడారు. జీవో 111 ద్వారా 2018 భత్యం నిర్ణయించారని వివరించారు. నాటి నుంచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిర్ణయం జరగలేదని వివరించారు. ఉపాధ్యాయులు దూరం ప్రాంతాల నుంచి వస్తూ ప్రయాసలు భరిస్తున్నారని వివరించారు. సహాయకులకు కేవలం రూ.250 మాత్రమే చెల్లించడం అన్యాయమని వివరించారు. టీఏ, డీఏలు సైతం చెల్లించేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. భత్యాన్ని నగదు రూపంలో ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కాశీరాం, నారాయణఖేడ్, మునిపల్లి, నిజాంపేట, రామచంద్రాపురం మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

'అధికారులు ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి'

గుమ్మడిదల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : అధికారులు పారదర్శకంగా ప్రజలకు సేవలందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఇటీవల గుమ్మడిదల తహసీల్దార్‌కు బాధ్యతలు చేపట్టిన పరమేశంను గోవర్ధన్‌రెడ్డి ట్రస్టు సభ్యులతో కలిసి సన్మానించారు. వీరితో నల్లవల్లి మాజీ సర్పంచ్ దోమడుగు శంకర్, సూర్యనారాయణ, దాసరి ఆంజనేయులు, చిరుమాని శ్రీనివాస్, నల్తూరి యాదగిరి, మధు, మ్యాకల రవీందర్, కొత్త కృష్ణ పాల్గొన్నారు.

సాంకేతిక సదస్సుతో సృజనాత్మకత వెలుగులోకి..



సదస్సులో పాల్గొన్న అతిథులు

నర్సాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక సదస్సుతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందని బీవీఆర్ఐటీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీలో ప్రోమేథియన్ సాంకేతిక సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా విద్యార్థుల విజ్ఞానం, నూతన ఆవిష్కరణల ప్రతిభలు వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. సదస్సులో రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు ఎలా ప్రారంభిస్తారు?

గుమ్మడిదల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా విస్మరించి ముందుగానే డంపింగ్‌యార్డు నిర్మాణ పనులు ఎలా మొదలు పెడతారని ప్రభుత్వంపై గుమ్మడిదల మండల రైతు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు తీవ్రంగా మండిపడ్డారు. నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో ప్రతిపాదించిన 152 ఎకరాల డంపింగ్‌యార్డు ఏర్పాటుకు స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కాగా జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 65వ రోజుకు చేరాయి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి శ్యామ్ పిస్టింగ్ పరిశ్రమ ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

రికవరీ

5వ పేజీ తరువాయి

నగదు రికవరీ చూపించకుండా పోలీసులే దాచేస్తున్నారా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు కొంత ముట్టజెబితేనే రికవరీ త్వరగా అవుతోందని, లేకుంటే నాన్చుడు వ్యవహారం కొనసాగుతుందని బాధితులు వాపోతున్నారు. జిల్లా, డివిజన్‌స్థాయి పోలీసులు అధికారులు నిజాయితీగా ఉన్నప్పటికీ కింది స్థాయి పోలీసు సిబ్బందికి మాత్రం కొంత ముట్టజెప్పాల్సి వస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు.

పండుగ వాతావరణంలో బీఆర్ఎస్ సభ

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- బీఆర్ఎస్ సభ పోస్టర్ ఆవిష్కరణ



జహీరాబాద్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/వట్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ఆవిర్భావ సభను ఈనెల 27న వరంగల్‌లో పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పాలనపై గడిచిన 16 నెలల్లోపే ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ సభకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మండలాధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన వట్‌పల్లిలో వరంగల్ సభకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం పోతులబొగుడలో పార్టీ కార్యకర్త శివయ్య మృతిచెందడంతో కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉంటామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఇదేనా సంపూర్ణ పారిశుధ్యం..?



మద్రి గ్రామంలోని మురుగు కాలువ దుస్థితి

కోహీర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం మద్రి గ్రామంలోని బీసీ కాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కొత్త కాలనీలో గల ప్రధాన మురుగు కాలువలో నీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో కాలనీవాసులు ఈగలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని మద్రి గ్రామస్థులు కోరుతున్నారు.

కాలువ వ్యర్థాలతోనే మురుగు సమస్య



పూడిక పనులు ప్రారంభించిన కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కాలువలు వ్యర్థాలతో మురుగు నీరు సజావుగా సాగడం లేదని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్‌లో రూ.40 లక్షలతో కాలువల్లో పూడిత తీసే పనులు ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలం రాకుండా ముందస్తుగా పూడికతీత పనులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. లింగంపల్లి నుంచి కానుకుంట, సాయినగర్, జ్యోతినగర్, ఉస్కుబావి వరకు ఉన్న వరద కాలువల్లో చెత్త నిండిపోయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, అరుణ్‌సింగ్, కిష్టారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీను, బలరాం, రాములు, బసవరాజ్, భాగయ్య, రాజేశం, బాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల వార్షికోత్సవాలు



సంగారెడ్డిలోని శ్రీనగర్ అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవంలో మాజీ కౌన్సిలర్ రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని శ్రీనగర్, కింది బజార్ అంగన్‌వాడీ కేంద్రాల వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆటల పోటీలు, సాంస్కృతిక అలరించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ మాజీ కౌన్సిలర్ నాయికోటి రమేశ్ చిన్నారులకు ప్రశంసపత్రాలతో పాటు సర్టిఫికేట్స్ అందజేశారు.

ప్రమాదాల నివారణకు బోర్డుల తొలగింపు

చేగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జీఎంఆర్ సంస్థ రోడ్డుకు ఇరువైపులా ఉన్న డిస్‌ప్లే బోర్డులను గురువారం తొలగించింది. కలకల్ నుంచి కామారెడ్డి వరకు తూప్రాన్ జీఎంఆర్ సంస్థ పరిధిలోని రోడ్డుకు ఇరువైపుల ఉన్న డిస్‌ప్లే బోర్డులతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతుందన్న ఉద్దేశంతో జీఎంఆర్ సంస్థ సిబ్బంది టీం సభ్యులు ఉపేందర్, చరణ్, రాజేందర్, సిద్ధార్థతో కలిసి తొలగిస్తున్నారు. ఇప్పటివరకు కాలాకల్ నుంచి తూప్రాన్, చేగుంట వరకు ఉన్న బోర్డులను తొలగించినట్లు వారు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కొల్చారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండలం రంగంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995-96 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం చిన్న ఘనపూర్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం నాడు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే..

నారాయణఖేడ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ అన్నారు. ఖేడ్ పట్టణంలో బీజేపీ 45వ వ్యవస్థాపక వారోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ విజయాల్లో కార్యకర్తలే వెన్నెముక లాంటివారని, పార్టీ కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలు మరువలేనివన్నారు. గ్రామాలు కేంద్రం నిధులతోనే నడుస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం కేంద్రమే ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, పార్టీ మండలాధ్యక్షుడు దశరథ్‌కురుమ, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

రేగోడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రేగోడు హనుమాన్ ఆలయ పునర్నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు విఠల్‌మహరాజ్ తెలిపారు. గురువారం విగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా గణపతి పూజ, పుణ్యవచనం, జలాధివాసము, అగ్నిప్రతిష్ఠ, అన్నదానం జరిగింది. 11న దాన్యవాసము, పర్యాయ హోమం, మంగళహారతి, తీర్థ ప్రసాదాలు, 12న హవాయిత దేవతలపూజ, మాధవానందస్వామి చేతుల మీదుగా యంత్ర, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే మండలంలోని మర్పల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు.

సిద్ధేశ్వర ఆలయ భూముల వేలం కౌలు రూ.8 లక్షలు

కంగ్టి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలో దేవాదాయశాఖ ఆదీనంలో ఉన్న సిద్ధేశ్వర ఆలయ భూములకు కౌలు కోసం గురువారం ఈవో రుద్రప్ప బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయానికి దాదాపు 45 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉండగా, ఈ భూమిని మూడుభాగాలుగా విభజించి వేలం చేపట్టారు. రూ.3.5 లక్షలకు నాగూర్ ఈశ్వర్ వేలం ద్వారా దక్కించుకోగా.. ఇంకొంత భూమికి సంబంధించి రూ.1.80 లక్షలకు గరిడేగాం విఠల్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రుద్రప్ప, చైర్మన్ వెంకట్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.